## హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన దాసుడు
## హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం దాతృత్వం, ఉదారత ఆధారంగా విశ్వాసభరిత ప్రస్తావన

హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 17.07.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం

أَشۡهَدُ أَنۡ لَّآ إِلٰهَ إِلَّا اللّٰهُ وَحۡدَهٗ لَا شَرِيۡكَ لَهٗ وَأَشۡهَدُ أَنَّ مُحَمَّدًا عَبۡدُهٗ وَرَسُوۡلُهٗ. أَمَّا بَعۡدُ فَأَعُوۡذُ بِاللّٰهِ مِنَ الشَّيۡطٰنِ الرَّجِيۡمِ.
بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ اَلۡحَمۡدُ لِلّٰهِ رَبِّ الۡعٰلَمِيۡنَ ○ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ مٰلِكِ يَوۡمِ الدِّيۡنِ ○ اِيَّاكَ نَعۡبُدُ وَاِيَّاكَ نَسۡتَعِيۡنُ ○ اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ ○ صِرَاطَ الَّذِيۡنَ اَنۡعَمۡتَ عَلَيۡهِمۡ غَيۡرِ الۡمَغۡضُوۡبِ عَلَيۡهِمۡ وَلَا الضَّآلِّيۡنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

అల్లాహ్ తఆలా మానవున్ని సృష్టించినప్పుడు, అంతకంటే ముందే అతని ప్రయోజనం కోసం లెక్కలేనన్ని అనుగ్రహాలను సృష్టించాడు. అల్లాహ్ ఈ దయ మానవుడు తన పట్ల కృతజ్ఞతతో ఉండాలని స్పష్టంగా కోరుతుంది. ప్రతి ప్రవక్తా అల్లాహ్‌కు కృతజ్ఞత చూపే దాసులుగా ఉండాలని తమ అనుచరులకు ఉపదేశించెను. వీటన్నింటికీ మించి కృతజ్ఞతకు అత్యుత్తమ ఆదర్శాన్ని మన మార్గదర్శకులైన హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం చూపించారు.

ఈరోజు నేను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి అదే ఆదర్శం, ప్రార్థనలు, పద్ధతుల గురించే ప్రస్తావిస్తాను. ఒక హదీసు ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారు: విశ్వాసం రెండు భాగాలుగా ఉంటుంది – సగం సహనంలో, సగం కృతజ్ఞతలో.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. వాస్తవానికి సహనం కూడా కృతజ్ఞత భావాన్నే వ్యక్తపరుస్తుంది. మరల దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారు: ఒక విశ్వాసి వ్యవహారమంతా మేలుతోనే కూడుకుని ఉంటుంది. ఇది విశ్వాసికి తప్ప మరెవరికీ సాధ్యం కాదు. అతనికి ఏదైనా సంతోషం కలిగితే, అతడు కృతజ్ఞతలు తెలుపుతాడు, ఇది అతనికి మేలు చేస్తుంది. ఒకవేళ అతనికి ఏదైనా కష్టం ఎదురైతే, అతడు సహనం వహిస్తాడు ఇది కూడా అతనికి మేలు చేస్తుంది.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: తోటి మనుషులకు కృతజ్ఞత చూపనివాడు అల్లాహ్‌కు కూడా కృతజ్ఞత చూపలేడు. అల్లాహ్‌కు కృతజ్ఞత తెలుపడమే కాకుండా, తోటి మనుషులకు కూడా కృతజ్ఞత చూపాలని ఆయన ప్రత్యేకంగా ఆదేశించారు. దీనిని ఆచరించినచో నిజమైన ఇస్లామి సమాజం రూపుదిద్దుకోవచ్చును.

హజ్రత్ ను'మాన్ బిన్ బషీర్ ఉల్లేఖించిన మరో హదీసు ప్రకారం, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లన్నారు. కొద్దిపాటి దానిపై కృతజ్ఞత చూపనివాడు, ఎక్కువ లభించినప్పుడు కూడా కృతజ్ఞత చూపలేడు. అల్లాహ్ అనుగ్రహాలను స్మరించుకోవడం కూడా ఒక రకమైన కృతజ్ఞతే. ఆయన ఇంకా ఇలా అన్నారు: జమాఅత్ అనేది ఒక కారుణ్యం, విభేదం అనేది శిక్ష.

హజ్రత్ ఉసామా బిన్ జైద్ ఉల్లేఖనం మేరకు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారు. తనకు ఎవరైనా మేలు చేసినప్పుడు, ఆ మేలు చేసిన వ్యక్తితో 'జజాకల్లాహు ఖైరా' (అల్లాహ్ మీకు అత్యుత్తమ ప్రతిఫలం ప్రసాదించుగాక) అని అన్నట్లయితే, అతడు ప్రశంసించాల్సిన (కృతజ్ఞత తెలపాల్సిన) బాధ్యతను పూర్తి చేసినట్లే. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. అల్లాహ్ తఆలా ఏదైనా జాతికి శుభాలను, అనుగ్రహాలను ప్రసాదించాలనుకున్నప్పుడు, వారి వయస్సును పెంచుతాడు, వారికి కృతజ్ఞతను ప్రేరేపిస్తాడు, అనగా కృతజ్ఞతలు అర్పించే సద్బుద్ధిని ప్రసాదిస్తాడు.

హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) చేతిని పట్టుకొని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లన్నారు, ఓ ముఆజ్! దేవుని సాక్షిగా నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నేను నీకు గట్టిగా ఉపదేశిస్తున్నాను, ప్రతి నమాజ్ తర్వాత ఈ విధంగా దుఆ చేయడం మాత్రం ఎన్నటికీ వదిలిపెట్టకు. ఓ అల్లాహ్! నిన్ను స్మరించుకోవడానికి, నీకు కృతజ్ఞతలు తెలుపుకోవడానికి మరియు అత్యుత్తమ రీతిలో నిన్ను ఆరాధించడానికి నాకు సహాయం ప్రసాదించు.

ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులకు ఈ దుఆ నేర్పించినట్లు మరొక కథనం గలదు. ఓ అల్లాహ్! నేను ప్రతి పనిలో నీ నుండి స్థిరత్వాన్ని కోరుకుంటున్నాను, సన్మార్గం పట్ల నిలకడను అడుగుతున్నాను. నీ అనుగ్రహానికి కృతజ్ఞత చూపే భాగ్యాన్ని, నిన్ను అత్యుత్తమంగా ఆరాధించే అదృష్టాన్ని వేడుకుంటున్నాను. నీ నుండి సత్యం పలికే నాలుకను, ప్రశాంతమైన హృదయాన్ని ప్రసాదించమని కోరుకుంటున్నాను. నీకు తెలిసిన ప్రతి కీడు నుండి నీ శరణు వేడుకుంటున్నాను. నీకు తెలిసిన ప్రతి మేలును ప్రసాదించమని అర్థిస్తున్నాను. నీకు తెలిసిన ప్రతి దానికీ క్షమాపణ వేడుకుంటున్నాను.

నమాజ్‌లో చేయుటకు అత్యుత్తమ దుఆ ఏమిటి? అని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను వేడుకోగా వారు (స) ఇట్లనిరి. ఓ అల్లాహ్! సర్వ ప్రశంసలు నీకే, సమస్త కృతజ్ఞతలు నీకే. సర్వాధికారం నీదే, సమస్త సృష్టి నీదే, ప్రతి వ్యవహారం నీ వైపుకే మరలుతుంది. మేము ప్రతి రకమైన మేలును నీ నుండే కోరుతున్నాము, ప్రతి రకమైన కీడు నుండి నీ శరణు వేడుకుంటున్నాము.

వారి (స) మరొక దుఆ ఇట్లు లభిస్తుంది. ఓ నా ప్రభూ! నాకు సహాయం చేయి, నాకు వ్యతిరేకంగా మరెవరికీ సహాయం చేయకు. నాకు అండగా నిలువు, నాకు వ్యతిరేకంగా మరెవరికీ అండగా నిలవకు. నా తరపున వ్యూహం పన్ను, నాకు వ్యతిరేకంగా పన్నకు. నాకు సన్మార్గం చూపు, ఆ సన్మార్గాన్ని నాకు సులభతరం చేయి. నాపై దౌర్జన్యానికి పాల్పడేవారికి వ్యతిరేకంగా నాకు సహాయం చేయి. ఓ అల్లాహ్! నన్ను నీకు కృతజ్ఞత చూపే దాసుడిగా, నిన్ను స్మరించేవాడిగా, నీ పట్ల భయభక్తులు గలవాడిగా, నీకు విధేయుడిగా, నీ ఆజ్ఞలను అత్యధికంగా పాటించేవాడిగా, నీ వైపుకే ఎక్కువగా మరలేవాడిగా మార్చు. ఓ నా ప్రభూ! నా పశ్చాత్తాపాన్ని స్వీకరించు, నా పాపాలను కడిగివేయు, నా ప్రార్థనను అంగీకరించు, నా వాదనకు బలాన్ని చేకూర్చు, నా హృదయానికి సన్మార్గం చూపు, నా నాలుకను సత్యంపై స్థిరంగా ఉంచు, నా హృదయం నుండి పగను, ద్వేషాన్ని దూరం చేయి.

మరొక దుఆ ఇట్లున్నది. ఓ అల్లాహ్! నన్ను నీకు అత్యధికంగా కృతజ్ఞతలు తెలిపేవాడిగా, నిన్ను ఎల్లప్పుడూ స్మరించేవాడిగా, నీ ఉపదేశాలను పాటించేవాడిగా, నీ కచ్చితమైన ఆజ్ఞలను గుర్తుంచుకునేవాడిగా మార్చు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఒక మనిషి ప్రతిరోజూ ఈ దుఆ చేస్తే, అతని మనసులో ఎలాంటి తప్పుడు ఆలోచనలు తలెత్తవు, అతను తప్పుడు పనుల జోలికి వెళ్లడు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరియు వారి (స) అనుచరులు వర్షపు మొదటి చుక్కలను తమ తలలపై వేసుకునేవారు. మరల వారు (స) ఇట్లనేవారు. మన వైభవోపేతుడైన మన అల్లాహ్ తరపున వచ్చిన తాజా వరమిది. వర్షానికి ఇలా కృతజ్ఞత తెలుపుకునేవారు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరుగుదొడ్డి నుండి బయటకు వచ్చినప్పుడు ఈ దుఆ చదివేవారు. హాని కలిగించే మురికిని నా నుండి దూరం చేసి, నాకు ఆరోగ్యాన్ని ప్రసాదించిన అల్లాహ్‌కే సర్వ ప్రశంసలు దక్కుతాయి.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం రాత్రి పూట పడుకునేటప్పుడు తన కుడి చేతిని చెంప కింద పెట్టుకుని ఈ విధంగా దుఆ చేసేవారు. ఓ అల్లాహ్! నీ నామస్మరణతోనే నేను మరణిస్తాను (నిద్రిస్తాను) మరియు జీవిస్తాను (మేల్కొంటాను). ఆయన (స) నిద్రలేచిన తర్వాత ఈ దుఆ చదివేవారు: మమ్మల్ని మరణింపజేసిన (నిద్రపుచ్చిన) తర్వాత తిరిగి బతికించిన (మేల్కొలిపిన) అల్లాహ్‌కే సర్వ ప్రశంసలు దక్కుతాయి. తిరిగి అతని వద్దకే వెళ్ళవలసి ఉంది.

వారు సల్లల్లాహు అలైహి వసల్లం భోజనం చేయడం ప్రారంభించినా అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలిపేవారు, కొత్త దుస్తులు ధరించినా అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెల్లించేవారు. మొత్తంమీద, వారు అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలపని, అతన్ని స్తుతించని సందర్భమంటూ ఏదీ లేదు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సేవలో ఒక వ్యక్తిని వచ్చెను. అతని జుట్టు చెదిరిపోయి ఉంది. (జుట్టును సరిగ్గా దువ్వుకోలేదు). అప్పుడు ఆయన (స) తన జుట్టును సరిచేసుకోవడానికి ఇతనికి ఏమీ దొరకలేదా? మరొక వ్యక్తిని చూసి ఇట్లనిరి. తన దుస్తులు ఉతుక్కోవాడనికి ఇతనికి నీళ్లు లభించలేదా!

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ఉపదేశించారు. తన గుండెలో ఆవగింజంత అహంకారం ఉన్నవాడు స్వర్గంలో ప్రవేశించడు. అప్పుడు మనిషి తన దుస్తులు, బూట్లు అందంగా ఉండాలని కోరుకుంటాడు కదా (మరి అది అహంకారమా?) అని ఒక వ్యక్తి అడిగాడు. దానికి ఆయన (స) ఇట్లు బదులిచ్చారు. అల్లాహ్ అందమైన వాడు, అతని అందాన్ని ఇష్టపడతాడు అని . ఇందులో ఎలాంటి సందేహం లేదు. అహంకారం అంటే తనను తాను గొప్పగా భావించి సత్యాన్ని తిరస్కరించడం మరియు ఇతరులను చులకనగా చూడటం.

బదర్ యుద్ధం సందర్భమున హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అవిశ్వాసుల వినాశనం మరియు అల్లాహ్ తఆలా తరపున లభించిన విజయానికి అల్లాహ్ తఆలాకు కృతజ్ఞతలు తెలిపినారు. ఇదే విధంగా మక్కా విజయం సందర్భమున కూడా వారి (స) కృతజ్ఞతతో కూడిన దుఆల ప్రస్తావన లభిస్తుంది. ఈ సందర్భముననే వారు (స) హజ్రత్ ఉమ్మె హానీ రజియల్లాహు అన్‌హా గృహంలో ఎనిమిది రకాతుల చాష్త్ నమాజ్ (కొంచెం పొద్దెక్కిన తర్వాత చదివే నమాజ్) చదివిరి.

హజ్జతుల్ విదా (చివరి హజ్) సందర్భంగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఒక దుఆ ప్రస్తావన ఇట్లు లభిస్తుంది. అల్లాహ్ తప్ప మరెవరూ ఆరాధనకు అర్హులు కారు. అతడు ఒక్కడే, అతనికి ఎలాంటి భాగస్వాములు లేరు. సర్వాధికారం అతనిదే, సమస్త ప్రశంసలు అతనికే దక్కుతాయి,

అతడు ప్రతి వస్తువుపైనా అధికారం గలవాడు. అల్లాహ్ తప్ప మరెవరూ ఆరాధనకు అర్హులు కారు. అతడు అద్వితీయుడు, అతడు తన వాగ్దానాన్ని నెరవేర్చాడు, తన దాసుడికి సహాయం చేశాడు, శత్రు సైన్యాలన్నింటినీ ఒంటరిగానే ఓడించి పారదోలాడు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఏ వ్యక్తిలోనైతే ఈ రెండు గుణాలు కనిపిస్తాయో, అల్లాహ్ అతడిని 'సాబిర్' (సహన శీలి) మరియు 'షాకిర్' (కృతజ్ఞత గలవాడు) గా వ్రాస్తాడు. ఒకటి ఏమనగా తనకంటే ఉన్నత స్థాయిలో (ఆధ్యాత్మికంగా) ఉన్నవారిని చూసి, వారిని అనుసరించడం. రెండవదేమనగా: తనకంటే తక్కువ స్థాయిలో (పేదరికంలో) ఉన్నవారిని చూసి, అల్లాహ్ తనకు ప్రసాదించిన దానికి అతన్ని స్తుతించడం.

వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ప్రాపంచిక విషయాల్లో తనకంటే తక్కువ స్థాయి వారిని చూడండి. ప్రాపంచిక వ్యవహారాల్లో తనకంటే ఉన్నత స్థాయిలో ఉన్నవారి వైపు చూడకండి. మీరు అల్లాహ్ తఆలా వరమును చిన్న చూపు చూడకండి.

వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఎవరికైతే ఈ కింది నాలుగు ప్రసాదించబడతాయో, వారికి ఇహలోక మరియు పరలోక శుభాలన్నీ ప్రసాదించబడినట్లే: కృతజ్ఞత చూపే హృదయం. అల్లాహ్‌ను స్మరించే నాలుక. కష్టాలు/పరీక్షల సమయంలో సహనం వహించే శరీరం. తన శీలం (పవిత్రత) విషయంలోనూ, భర్త సంపద విషయంలోనూ ఎలాంటి నమ్మకద్రోహానికి పాల్పడని సతీమణి.

హజ్రత్ ఆయేషా (రజి) ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎల్లవేళలా అల్లాహ్‌ను స్మరించే వారు. ఈ విధంగా ఆయన తన సమాజం ముందు తన ఆదర్శానికి సంబంధించిన అత్యుత్తమ ప్రమాణాలను నెలకొల్పారు మరియు మనకు ఉపదేశించారు. అల్లాహ్ వీటిని ఆచరించే భాగ్యాన్ని మనకు ప్రసాదించుగాక!

ముగింపులో హుజూరె అన్వర్ ఇట్లనిరి. మరో విషయం ఏమిటంటే, నేను క్లుప్తంగా తెలియ జేస్తున్నాను. ఇన్షాఅల్లాహ్ వచ్చే శుక్రవారం నుండి అహ్మదియ్య జమాఅత్ బ్రిటన్ (UK) జల్సా సాలానా (వార్షిక మహాసభ) కూడా ప్రారంభం కాబోతున్నది. అల్లాహ్ తఆలా దీనిని అన్ని విధాలా శుభప్రదంగా చేయాలని ప్రార్థించండి. ప్రతి ఒక్కరినీ అతడు  తన సంరక్షణలో, భద్రతలో ఉంచుగాక. ఈ రోజుల్లో ఉన్న ఎండల తీవ్రత (వాతావరణం) దృష్ట్యా కొన్ని ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయి. అన్ని రకాల చెడు ప్రభావాల నుండి అల్లాహ్ తఆలా అందరినీ సురక్షితంగా రక్షించుగాక. ఇలాగే, సేవలు (విధులు) నిర్వహించే కార్యకర్తలు, కొన్నిసార్లు ఎండలో నిలబడి పని చేయాల్సి వస్తుంది, కొన్ని కఠినమైన విధులు కూడా ఉంటాయి, కాబట్టి వారు కూడా తమ బాధ్యతలను అత్యుత్తమ రీతిలో నెరవేర్చే శక్తిసామర్థ్యాలను అల్లాహ్ తఆలా వారికి ప్రసాదించుగాక! (ఆమీన్).

---

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِيْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَيْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ يَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ يُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِی الْقُرْبٰی وَيَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ۔ يَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ يَذْکُرْکُمْ وَادْعُوْہُ يَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔